క్లుప్తంగా

నిబంధనలు పాటించాలి

నింద్ర: ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలని నింద్ర ఎస్‌ఐ రామచంద్ర అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన వాహనదారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రమాదాలకు గురి కాకుండా చూడాలన్నారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం, వాహనాలు అధిక స్పీడ్‌లో ప్రయాణించడం, ఇతర వాహనాలను ఓవర్‌టేక్ చేయరాదని అన్నారు. ఈ కార్యక్రమంలో వాహనదారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయ ఉచిత తరగతులు

పుత్తూరు: పట్టణ పరిధిలోని జెండామాను వీధిలోని బాసర అకాడమీలో ఈ నెల 21 నుంచి 22వ తేదీ వరకు నవోదయ ప్రవేశ పరీక్షలపై ఉచిత అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్లు అకాడమి ప్రిన్సిపల్ ఏబీ సరళాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థులు ఈ తరగతులకు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 94904 31939, 94401 26719 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

నేడు బలిబండి కుంభాలు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లంలో ఉన్న శ్రీకృష్ణ సమేత ద్రౌపదీ ధర్మరాజుల ఆలయంలో జరుగుతున్న మహా భారత ఉత్సవాలలో భాగంగా ఆదివారం సాయంత్రం బలి బండి కుంభాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భాగవతారిణి భారతి హరికథ కాలక్షేపం చేపట్టారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

కార్వేటినగరం: బాలాజీ కాలనీలో వెలసి ఉన్న శ్రీషిరిడీ సాయినాథుని ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని వేకువ జామున సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు రవిస్వామి ఆలయంలో ప్రత్యేక హోమం ఏర్పాటు చేసి స్వామివారికి కాగడ హారతులు పట్టారు. వ్రతంలో పాల్గొన్న దంపతులకు అర్చకులు సాయిబాబా పటంతోపాటు, అన్న ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బాలాజీ, కమిటీ సభ్యులు చిరంజీవిరెడ్డి, పయణిరెడ్డి పాల్గొన్నారు.

బాధితులపై వివక్ష తగదు

పాలసముద్రం: కుష్టు వ్యాధి బాధితులపై వివక్ష తగదని, ఈ వ్యాధి లక్షణాలు ఉన్నవారి వివరాలను వెంటనే తెలియజేయాలని వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. శనివారం క్రిష్ణజమ్మపురం సచివాలయ పరిధిలోని ఇందిరానగర్‌లో ఇంటింటి కుష్టు వ్యాధి గుర్తింపు సర్వేను సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధిగ్రస్తులను సమాజంలో చిన్నచూపు చూడకుండా ఆదరించాల్సిందిగా పేర్కొన్నారు. ప్రతి ప్రభుత్వ ఆస్పత్రిలో వ్యాధి నివారణ మందులు లభిస్తాయన్నారు. అనంతరం ఇంటింటి సర్వేను లిస్టుని పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సుశీల, మురళి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

వెదురుకుప్పం: ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈఓ దామోదరం తనిఖీ చేశారు. శనివారం పాఠశాలను సందర్శించిన ఎంఈఓ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, రుచి చూశారు. అంతకు ముందు విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు వండి పెట్టాలన్నారు. సమయపాలన పాటించి, విద్యార్థులను అన్ని విధాలా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులు చేతన, పురుషోత్తంలను ఆదేశించారు. ఆయన వెంట సీఆర్పీ విక్కీదాదా ఉన్నారు.

చెత్త బుట్టలు పంపిణీ



చెత్త బుట్టలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

నింద్ర: మండలంలోని వివిధ పంచాయతీల్లో శనివారం చెత్త బుట్టల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రమైన నింద్రలో సర్పంచ్ వసంతమ్మ చెత్త బుట్టలను పంపిణీ చేశారు. ప్రతి ఇంటికి రెండు బుట్టలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని అగరం, శ్రీరామపురం, చవరంబాకం గ్రామాల్లో చెత్తబుట్టలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ధరణి తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లు బాధ్యతగా పని చేయాలి

పాలసముద్రం: అన్ని పంచాయతీల్లో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో గ్రీన్ అంబాసిడర్లు బాధ్యతగా పని చేయాలని జిల్లా ఫీల్డ్ కోఆర్డినేటర్ జేన్స్ తెలిపారు. శనివారం మండలంలోని వనదుర్గాపురం పంచాయతీలోని చెత్త సేకరణ కేంద్రాన్ని డీఎఫ్‌టీసీ జేన్స్ సందర్శించారు. గ్రీన్ అంబాసిడర్లతో ఆయన మాట్లాడుతూ మండలంలోని అని గ్రామాల్లో కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్ల ద్వారా ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను అభివృద్ధి చేయాలన్నారు. చెత్తను సంపద తయారీ కేంద్రాల వద్దకు తరలించి, వానపాములు వదలాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.



పుల్లయ్యగుండలో సాగులోని దానిమ్మ తోట

మెరుగైన యాజమాన్యం..

మేలైన ఫలసాయం

రైతన్నలు పలు పంటలు సాగు చేసినా దిగుబడి అంతంత మాత్రం రావడంతో పండ్ల తోటల పెంపకంపై మొగ్గు చూపుతున్నారు. దానిమ్మకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉండడంతో పలువురు రైతులు దానిమ్మ పంట సాగు చేస్తున్నారు. కొందరు మేలైన యాజమాన్య పద్ధతులతోపాటు పంటకు ఆశించే వివిధ పురుగులు, తెగుళ్లను సకాలంలో నివారిస్తూ దానిమ్మతో ఇంట సిరులు పండించుకుంటున్నారు. మండల వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ దానిమ్మ సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను, సస్యరక్షణ చర్యలను సమగ్రంగా వివరించారు.

- దానిమ్మ సాగులో మెళకువలు పాటిస్తే లాభాలు



మండల వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్

పాలసముద్రం: పొడి వాతావరణం అనుకూలం. గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉంటే చీడపీడల ఉధృతి అదే స్థాయిలో ఉంటుంది. లోతైన, సారవంతమైన మురుగునీరు పోయే వీలు ఉన్న నేలలు చాలా అనుకూలం. గణేష్, మృదుల, భగువ అనే దానిమ్మ మొక్కలు అనువైనవి.

మొక్క నాటే విధానం

నేల రకం, నేల స్వభావం, వాతావరణ పరిస్థితుల ఆధారంగా 3.3 నుంచి 4.4 మీటర్ల దూరం ఉండాలి. 60.60.60 సెంటీమీటర్లు గుంతలు తీసి, 20 కిలోల పశువుల ఎరువు, కిలో సూపర్ ఫాస్ఫేట్, 2శాతం లిండేన్ పొడిని మట్టిలో కలిపి గుంతలు నింపాలి.

ప్రవర్ధనం విధానం

గాలి అంట్లు, నేల అంట్లు లేదా కొమ్మల ప్రవర్ధన ద్వారా వచ్చిన మొక్కలను నాటుకోవాలి. 50–70 రోజుల్లో అంట్లు వేర్లు నాటేందుకు అనుకూలం.

ఎరువులు వేసే విధానం

ఒక్కొక్క చెట్టుకు నాలుగు నెలల తర్వాత 125 గ్రాముల వేపపిండి, 5 కిలోల చివికిన పశువుల ఎరువు, ఏడు నెలల తర్వాత 250 గ్రాముల వేపపిండి 10 కిలోల చివికిన పశువుల ఎరువు, 11 నెలల తర్వాత 750 గ్రాముల వేపపిండి 10 కిలోల చివికిన పశువుల ఎరువు వేసుకోవాలి. ఆ తర్వాత ప్రతి మొక్కకు సంవత్సరానికి 30 కిలోల పశువుల ఎరువు, 625 గ్రాముల నత్రజని, 250 గ్రాముల భాస్వరం, 250 గ్రాముల పొటాష్ దఫాలుగా మొదటి తడికి ముందు, తరువాత కాయ ఎదిగే దశల్లో వేయాలి. జింకు లోపమున్న ఆకుల పరిమాణం చిన్నదిగా ఉండి వంకర్లు తిరిగి ఉంటాయి. దీని నివారణకు లీటరు నీటికి ఐదు గ్రాముల జింకు సల్ఫేటును కలిపి 1–2 సార్లు కొత్త చిగురు ఉన్నప్పుడు పిచికారీ చేయాలి. ఫెర్రస్(ఇనుము) ధాతువు లోపించిన ఆకుల తెల్లబడుతాయి. నివారణకు గాను 2.5 గ్రాముల ఫెర్రస్ సల్ఫేట్ ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నీటి తడులు సక్రమంగా ఉన్నా బోరాన్ లోపించినపుడు లేత కాయల్లో పగుళ్లు ఏర్పడుతాయి. నివారణకు 1.25 గ్రాముల బోరాక్సును పాదులకు వేయాలి. లేదా లీటరు నీటికి రెండు గ్రాముల బోరాక్సును కలిపి పిచికారీ చేయాలి.

కాయలు కాపుదల

దానిమ్మ జూన్–జూలై, ఫిబ్రవరి–మార్చి నెలల్లో పూతకు వస్తుంది. కాయ ధరను వాతావరణాన్ని బట్టి ఏదో ఒకదాని నుంచి పంటను తీసుకోవాలి. వర్షాకాలపు పంట నాణ్యత అధికంగా ఉంటుంది. పంట కాలాన్ని, బహార్ పద్ధతి ద్వారా అదుపులో ఉంచాలి. బహార్ పద్ధతిలో సీజన్ ఎన్నుకొని చెట్లకు నీటి తడులు మానివేయాలి. వాతావరణ, భూస్వభావ పరిస్థితులను బట్టి ఎన్ని రోజులన్నది నిర్ణయించాలి. మొదటి నీటి తడి ఇచ్చే ముందు కొమ్మలు కత్తిరించి ఎరువులు వేసి నీరు పెట్టాలి. పంట కోత అనంతరం పూత పూసే కాలానికి ఒక నెల ముందు వరకు నీటి పారుదలను నిలిపి వేయడం ద్వారా పంట కాలాన్ని అదుపులో ఉంచవచ్చు. ప్రతి చెట్టుకు 60–70 కాయలు మించి ఉంటే కాయలు బరువు తగ్గి మార్కెట్ ధర తక్కువగా ఉంటుంది.



నీటి యాజమాన్యం

నేలలో నీటి శాతం ఒకే విధంగా ఉండాలి లేక పోతే పండ్లు పగులుతాయి. మార్చి నుంచి జూలై వరకు భూమిలో తేమ సమంగా ఉండేలా చూసుకోవాలి. డ్రిప్ పద్ధతి ద్వారా నీరు పెడితే చెట్టు పెరుగుదల, కాయల సంఖ్య, బరువు శాతం వరకు పెంచవచ్చు.

కత్తిరింపులు

ప్రతి మొక్కకు బలంగా పెరిగిన నాలుగు కొమ్మలను కాండాలుగా ఉంచి మిగిలినవి కత్తిరించాలి. 2–3 సంవత్సరాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ కొమ్మలను తగు రీతిగా పెంచి సరైన ఆకారం తీసుకురావాలి. నేలకు పాకే కొమ్మలు, గుబురుగా పెరిగే కొమ్మలు, నీటి కొమ్మలను కత్తిరించాలి. చెట్లకు విశ్రాంతినిచ్చే సమయంలో చివరి కొమ్మలను 10–15 సెంటీ మీటర్ల పొడవు కత్తిరించాలి. కత్తిరించిన తర్వాత వచ్చిన చిగుర్లలో 2–3 ఉంచి మిగతావి తీసేస్తే బలంగా తయారై కొమ్మలపై పిందెలు ఏర్పడి కాయసైజు పెరుగుతుంది. చెట్టుకు 40–50 కాయలు ఉంచి మిగతావి తీసివేయాలి.

పంట దిగుబడి

నాలుగు సంవత్సరాల తరువాత ఏటా ఒక్కో చెట్టు సగటున 100–150 పండ్లను ఇవ్వగలదు. పూత నుంచి పండు వరకు 5–6 నెలలు పడుతుంది. 5–2 మీటర్ల దూరంతో ఎకరాకు 400 చెట్లతో అధిక దిగుబడి పొందవచ్చు. తూర్పు, పడమమరలో ఐదు మీటర్లు, ఉత్తర, దక్షిణాలలో రెండు మీటర్లు ఉండేలా నాటు కోవాలి.

తెగుళ్ల బెడద

లేత కాయలపై మచ్చలు ఏర్పడి పక్కనున్న మచ్చలతో కలిసి పెద్దవిగా ఏర్పడి పత్రహరితం లోపించి పెరుగకుండా గట్టిపడి రాలిపోతాయి. దీని నివారణకు మచ్చలు గమనించిన వెంటనే పూత, పిందె దశ నుంచి లీటరు నీటిని రెండు గ్రాములు మ్యాంకోజెబ్, కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా బేకార్ లేదా ఒక మిల్లీ లీటరు ఇప్రోడిన్ 15 రోజుల వ్యవధిలో 3–4 సార్లు పిచికారీ చేయాలి.

పేను బంక పురుగు

ఈ పురుగులు లేత కొమ్మలపైన, లేత ఆకులపైన, ఎక్కువ శాతం ఆకుల అడుగు భాగాన చేరి రసాన్ని పీలుస్తూ జీవిస్తాయి. ఇవి ఆశించిన ఆకులు వంకర్లు తిరిగి చివరగా ఎండిపోతాయి. నివారణకు లీటరు నీటికి రెండు మిల్లీ లీటర్లు డైమిథోయేట్ పిచికారీ చేయాలి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నపుడు మిథైల్ డెమిటాన్ రెండు మిల్లీ లీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

బాక్టీరియా మచ్చ తెగులు

సాధారణంగా ఈ తెగులు 27 నుంచి 37 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత, 70 శాతంపైగా గాలిలో తేమశాతం ఉండే జూలై నెల నుంచి అక్టోబర్ మాసాలలో తీవ్రంగా ఉంటుంది. అంతేకాక వేసవిలో కురిసే వర్షాల వల్ల ఏర్పడే వాతావరణ పరిస్థితులు కూడా ఈ తెగులు వ్యాప్తికి అనుకూలం. తెగులు సోకిన చెట్లకు అంట్లు కట్టుట వలన నర్సరీ దశలోనే వ్యాప్తి చెందుతుంది. ఆకులపైన కొమ్మలపైన, పిందెలపైన నీటిలో తడిచిన మచ్చలు కనిపిస్తాయి. ఈ మచ్చలు అధికమై ఒకదానితో ఒకటి కలిసిపోవడంతో ఆకులు రాలిపోవడం, కొమ్మలు కణువుల వద్ద విరిగిపోవడం, కాయలపై మచ్చలు నలుపు రంగులోకి మారి వాటిపై ×వై¥ లేదా ఎల్ ఆకారపు నెరియలు ఏర్పడుతాయి. వీటి నివారణకు రోగ రహిత అంటు మొక్కలు నాటాలి. తెగులు ఆశించిన కొమ్మల భాగాలను అంగుళం కింది వరకు కత్తిరించి కాల్చివేయాలి. కత్తిరింపు సమయంలో వాడే కత్తెరలను ఒక శాతం సోడియం హైపోక్లోరైడ్ ద్రావణంతో 30 నిమిషాలు నానబెట్టి ఉపయోగించాలి. కత్తిరింపులు అయిన వెంటనే ఒక శాతం బోర్డో మిశ్రమాన్ని పిచికారీ చేయాలి. సెప్టెంబర్ మాసాలలో వచ్చే పూతను మాత్రమే పంటకు వదలాలి. రసాయన ఎరువులు అవసరానికి మించివేయరాదు. నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులతో పాటు, జింక్, బోరాన్, ఇనుము లాంటి సూక్ష్మధాతువులను వేయడంతో చెట్టుకు రోగనిరోధక శక్తి పెరుగుతుంది. తెగులు సోకిన కాయలను ఎప్పటికప్పుడు పెరికి కాల్చి వేయాలి. తెగులు లక్షణాలు గమనించిన వెంటనే చెట్టుపై లీటరు నీటికి 200 మిల్లీ గ్రాములు అగ్రిమైసిన్ లేదా స్ట్రెప్టోసైక్లిన్, మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి పిచికారీ చేయాలి.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

విజయపురం: మండలంలోని పన్నూరు ఎస్టీ కాలనీ, ఎల్ల సముద్రం ఎస్టీ కాలనీ విద్యార్థులకు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు ఎస్.చంద్రయ్య నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు తదితర విద్యాసామగ్రి వితరణ చేశారు. శనివారం ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు. అనంతరం దాత మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సాయం చేయడానికి దాతలు ముందుకు వస్తున్నారని, పాఠశాలల బలోపేతానికి తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీసీ చైర్మన్ యశోద, ఉపాధ్యాయిని సుధ, గ్రామస్తులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి ప్రత్యేక హోదా తేవాలి

నగరి: రాష్ట్రానికి ప్రత్యేక హోదాను, పోలవరం ప్రాజెక్టుకు నిధులను కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్ర ప్రభుత్వం సాధించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ పట్టణ కార్యదర్శి వేలన్ అధ్యక్షతన నగరి పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి టీడీపీ మద్దతు ఇచ్చినందున విభజన చట్టంలో ఇచ్చిన హామీలను అమలు చేసేలా ఒత్తిడి తేవాలన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య, బాషా, విజయ్ కుమార్, మురళి, రాజేంద్ర, దేశప్ప, నాగరాజు, సిరాజుద్దీన్, శేఖర్, సతీష్, శ్యామల, పార్వతి, దండమ్మ పాల్గొన్నారు.

ఆరేటమ్మకు నాగపడగ, కిరీటం బహూకరణ

పుత్తూరు: గ్రామదేవత ఆరేటమ్మ ఆలయానికి మనోహర్‌రెడ్డి, జగన్నాథం, వాణి, ఉమాశంకర్, దయశ్రీ అనే దాతలు రూ.18 వేలు విలువైన నాగపడగను తమ తల్లిదండ్రులు నరసింహారెడ్డి, నారాయణమ్మ జ్ఞాపకార్థం అందించారు. అలాగే సుబ్రమణ్యం, ధనమ్మ, ఉదయ్, దివ్య, దాము అనే దాతలు వారి తల్లిదండ్రులు వెంకటేశు, క్రిష్ణమ్మ జ్ఞాపకార్థం రూ.20 వేలు విలువైన కిరీటాన్ని అందజేశారు. దాతలు తాము విరాళంగా తెచ్చిన నాగపడగ, కిరీటాన్ని ఆలయ చైర్మన్ మనోహర్‌రెడ్డికి అందజేశారు.

అలరించిన దుర్యోధన వధ



దుర్యోధన వధ సన్నివేశం

కార్వేటినగరం: శ్రీద్రౌపదీ, ధర్మరాజుల స్వామి వారి అలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం దుర్యోధన వధ ఘట్టం అట్టహాసంగా జరిగింది. ఉదయం ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేపట్టి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. మధ్యాహ్నం భాగవతారిణి రెడ్డెమ్మ దుర్యోధన వధ ఘట్టం హరికథను భక్తులకు కనులకు కట్టినట్లు ఆలపించారు. సాయంత్రం శ్రీవేంకటేశ్వర నాటక కళామండలి ఆధ్వర్యంలో దుర్యోధన వధ ఘట్టాన్ని ప్రదర్శించారు. దుర్యోధనుడి భీమసేనుడు గంగ మడుగు నుండి తీసుకొచ్చే ఘట్టం చూపరులను విశేషంగా ఆకట్టుకొంది. దుర్యోధన పాత్రధారి ఆలపించిన పద్యాలు పలువురిని కంట తడి పెట్టించాయి. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా తూర్పు వీధివారు వ్యవహరించారు. అలాగే 2003లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆలయ ఆవరణలో వెయ్యిమందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేడు అగ్ని గుండప్రవేశం

శ్రీద్రౌపదీ ధర్మరాజుల స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అగ్ని గుండ ప్రవేశం ఉంటుందని ఆలయ అధ్యక్షుడు పోకల సోమనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం ఆలయ ఆవరణలో అగ్నిగుండ ప్రవేశం ఉంటుందని, మొక్కులున్న భక్తులు అగ్ని గుండ ప్రవేశానికి రూ.400 చెల్లించి కంకణం ధరించాలన్నారు. మహిళలకు అగ్ని గుండ ప్రవేశం లేదని, మొక్కులున్న మహిళలు కంకణాలు ధరించి అగ్నిగుండం చుట్టు ప్రదక్షిణ చేసి మొక్కులు తీర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు హరిబాబు, శివప్రకాష్, బాబురెడ్డి, క్రిష్ణయ్య పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కార్వేటినగరం: రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్.ఐ వెంకటకృష్ణ అన్నారు. శనివారం గాండ్ల మిట్టకూడలిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటకృష్ణ మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులు రోడ్డు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. వాహనాలకు నంబర్ ప్లేట్లు ఉండాలని, ర్యాష్ డ్రైవింగ్ చేస్తే కేసులు నమోదు చేసి, భారీగా జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ద్విచక్రవాహనంలో త్రిపుల్స్ వెళ్లినా కేసున మోదు చేస్తామని చెప్పారు. మైనర్లు వాహనాలు నడిపితే వాహనాన్ని సీజ్ చేయడమే కాకుండా వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. లైసెన్సులు, వాహనాలకు సంబంధించిన రికార్డులు సక్రమంగా లేని వాహనదారులను స్టేషన్ వద్ద రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మునికృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



బూచివానత్తంలో బురద తొలగింపు

పాలసముద్రం: వర్షాలు కురుస్తుండంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. మండలంలో బాలక్రిష్ణాపురం, అముదాల పంచాయతీల్లో ఎంపీడీఓ రామనాథరెడ్డి ఆదేశాల మేరకు ఈఓపీఆర్‌డీ రమేష్ శనివారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా కాలువల్లో మురుగు తీయడంతోపాటు తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేశారు. గ్రామాల్లో పిచ్చి మొక్కలను తొలగించారు. గ్రామస్తులతో రమేష్ మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. వర్షపు నీటిలో దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

బూచివానత్తంలో..

విజయపురం: మండలంలోని బూచివానత్తం పంచాయతీలో శనివారం పారిశుధ్య పనులు చేపట్టారు. రోడ్డుపై నిలిచి ఉన్న వర్షపు నీటిని తొలగించారు. మురికి కాలువల్లో ఆయిల్ బాల్స్ వేశారు. రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలను తొలగించి, బ్లీచింగ్ చేశారు. గ్రామ సమీపంలో ఉన్న పేడ దిబ్బలను తొలగించారు. అనంతరం పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలలో వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. పొడి, తడి చెత్తలను వేరు చేసి, గ్రామానికి దూరంగా ఉన్న చెత్తకుండలో వేయాలని సూచించారు. ఇంటి చుట్టూ పాత టైర్లు, ప్లాస్టిక్ బాటిల్స్ లేకుండా, ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని కోరారు.

ఆకట్టుకున్న పాండవ జననం

వెదురుకుప్పం: పచ్చికాపల్లంలో ఉన్న శ్రీకృష్ణ సమేత ధర్మరాజుల ఆలయంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం పాండవ జననం ఘట్టం ఆకట్టుకుంది. చిన్నప్పటి పాండవుల వేషధారణలో ఉన్న విగ్రహాలు వేంచేపు చేసి ఊయలలో ఉంచి ప్రదర్శించారు. ప్రధానంగా శ్రీకృష్ణుడిని ఊయలలో ఉంచి ప్రదర్శించారు. మధ్యాహ్నం భాగవతారిణి భారతి హరికథా కాలక్షేపం చేపట్టారు. ఈ కార్యక్రమానికి మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.